ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

విశాఖపట్నం కేంద్రం

జాతీయ వార్తలు

తేదీ: 19-02-2025 సమయం : రాత్రి 8 గం. 30 ని. లు

ముఖ్యాంశాలు

- గ్రామీణ ప్రజల జీవనప్రమాణాలను పెంపొందిచేలా ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతోందని కేంద్రమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పేర్కొన్నారు.

- శివాజీ మహరాజ్ స్ఫూర్తితో వికసిత్ భారత్ నిర్మాణానికి కృషి చేస్తున్నామని కేంద్రమంత్రి మన్సుఖ్ మాండవియా తెలిపారు.

- నూతన ఆవిష్కరణలతో భారత అంతరిక్ష రంగం ప్రపంచ దేశాలకు ప్రమాణాలను నిర్దేశిస్తోందని కేంద్ర సహాయ మంత్రి డాక్టర్. జితేంద్ర సింగ్ అన్నారు.

- ప్రధానమంత్రి నరేంద్రమోదీ "మన్ కీ బాత్ మనసులోని మాట" కార్యక్రమం 119వ సంచిక ఈ ఆదివారం ప్రసారం కానుంది.

==========

గ్రామీణ ప్రజల జీవనప్రమాణాలను పెంపొందిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపట్టిందని కేంద్ర వ్యవసాయ శాఖా మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. న్యూ ఢిల్లీలో ఆఫ్రికన్ - ఆసియన్ రూరల్ డెవలప్‌మెంట్ ఆర్గనైజేషన్ (AARDO) ఎగ్జిక్యూటివ్ కమిటీ 77వ సెషన్‌ను ఈరోజు ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి మాట్లాడుతూ... జాతీయ గ్రామీణ జీవనోపాధి మిషన్ ద్వారా దాదాపు 10 కోట్ల మంది మహిళలు సుమారు 90 లక్షల స్వయం సహాయక బృందాల్లో చేరారని, వారికి 50 వేల కోట్ల రూపాయల ఆర్థిక సాయం అందించామని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో దాదాపు 1 కోటి 25 లక్షల మంది మహిళలు లఖ్‌పతి దీదీలుగా మారారని కేంద్ర మంత్రి వివరిస్తూ.....

(వాయిస్ 30 సెకన్లు)

==========

ఛత్రపతి శివాజీ మహారాజ్ 395వ జయంతి సందర్భంగా ఈరోజు పూణెలో జరిగిన పాదయాత్రలో కేంద్ర యువజన, క్రీడల శాఖా మంత్రి మన్సుఖ్ మాండవియా పాల్గొన్నారు. కేంద్ర క్రీడల మంత్రిత్వ శాఖ, రాష్ట్ర ప్రభుత్వం, పూణే జిల్లా యంత్రాంగం సంయుక్తంగా నిర్వహించిన మార్చ్ ప్రభుత్వ ఇంజనీరింగ్ కళాశాల మైదానం నుండి ఫెర్గూసన్ కళాశాల వరకు సాగింది. ఈ సందర్భంగా కేంద్రమంత్రి మాట్లాడుతూ... ఆదర్శ పాలన, మహిళల పట్ల గౌరవం కల్పించడం ద్వారా శివాజీ మహారాజ్... హైందవీ స్వరాజ్యానికి పునాది వేసినట్లే, ఆయన సిద్ధాంతాల స్ఫూర్తితో అభివృద్ధి చెందిన భారత్ నిర్మాణానికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని ప్రభుత్వం కృషి చేస్తోందని ఉద్ఘాటించారు.

==========

గిరిజన సాంప్రదాయాలు, సంస్కృతి, భాషలను కాపాడుకోవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని జాతీయ షెడ్యూల్డ్ తెగల కమిషన్ (NCST) చైర్‌పర్సన్ అంతర్ సింగ్ ఆర్య అన్నారు. ఈరోజు షెడ్యూల్డ్ తెగల జాతీయ కమిషన్ 22వ వ్యవస్థాపక దినోత్సవంలో ఆయన మాట్లాడుతూ... జన్ జాగరణ్ అవగాహన కార్యక్రమం ద్వారా కమిషన్ యువతను ఈ దిశగా ప్రోత్సహిస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ "ఏక్ పేడ్.. మా కే నామ్.." నినాదాన్ని కమిషన్ శ్రద్ధగా అమలు చేస్తోందన్నారు.

==========

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 119వ సంచిక ఈనెల 23వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది. మన్ కీ బాత్ కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు, సలహాలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 21వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

==========

భువనేశ్వర్‌లోని KIIT విశ్వవిద్యాలయంలో నేపాల్‌కు చెందిన విద్యార్థిని ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై న్యాయం చేస్తామని ఒడిశా రాష్ట్ర ముఖ్యమంత్రి మోహన్ చరణ్ మాఝి... నేపాల్ రాయబార కార్యాలయానికి హామీ ఇచ్చారు. ఈరోజు ఆయన నేపాల్ రాయబారులతో మాట్లాడుతూ... KIIT ప్రాంగణంలో సాధారణ పరిస్థితులు నెలకొంటాయని చెప్పారు. కాగా... విద్యార్థిని ఆత్మహత్య ఘటనపై విచారణకు ఒడిశా ప్రభుత్వం ఉన్నతస్థాయి నిజనిర్ధారణ కమిటీని ఏర్పాటు చేసింది.

==========

ఫాస్ట్‌ట్యాగ్ నిబంధనలకు సంబంధించి కొన్ని సామాజిక మాధ్యమాల్లో వచ్చిన వార్తలను నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా (NHAI) తోసిపుచ్చింది. వాహనాలు టోల్‌ప్లాజాను దాటేటప్పుడు తలెత్తే సాంకేతిక సమస్యల పరిష్కారం కోసం నేషనల్ పేమెంట్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా గత నెల 28న ఒక ప్రకటన విడుదల చేసిందని పేర్కొంది. అయితే ఈ ప్రకటన ఫాస్ట్‌ట్యాగ్ కష్టమర్లపై ఎటువంటి ప్రభావం చూపదని స్పష్టం చేసింది.

విరామం

==========

దేశ రాజధాని ఢిల్లీకి ముఖ్యమంత్రిగా బీజేపీ ఎమ్మెల్యే రేఖా గుప్తా ఎన్నికయ్యారు. బీజేపీ శాసనసభాపక్షం ఆమెను ముఖ్యమంత్రిగా ఎన్నుకుంది. రేపు సాయంత్రం ఢిల్లీలో జరిగే కార్యక్రమంలో ఆమె ఢిల్లీ నూతన ముఖ్యమంత్రిగా ప్రమాణ స్వీకారం చేయనున్నారు. ఈ నెల 5న ఢిల్లీ అసెంబ్లీ ఎన్నికలు జరుగగా.. 8వ తేదీన ఫలితాలు

వెల్లడయ్యాయి. ఇందులో ఘన విజయం సాధించిన బీజేపీ 70 స్థానాలకు గాను 48 చోట్ల విజయం సాధించి, 27 సంవత్సరాల తర్వాత ఢిల్లీలో అధికారం చేపడుతోంది.

==========

భారత అంతరిక్ష రంగంలో గతంలో ఎన్నడూ లేని విధంగా నూతన ఆవిష్కరణలు, ప్రయోగాలు వెలుగు చూస్తున్నాయని కేంద్ర శాస్త్ర సాంకేతిక శాఖా సహాయ మంత్రి డాక్టర్. జితేంద్ర సింగ్ అన్నారు. నూతన ఆవిష్కరణలతో అంతరిక్ష రంగం ప్రపంచ దేశాలకు ప్రమాణాలను నిర్దేశిస్తోందని పేర్కొన్నారు. అంతరిక్ష డాకింగ్ ప్రయోగం Spa DeX భారతదేశ సాంకేతిక పురోగతికి నిదర్శనమని, గగన్‌యాన్, చంద్రయాన్-4, భారతీయ అంతరిక్ష స్టేషన్ వంటివి భవిష్యత్ అంతరిక్ష యాత్రలకు మార్గం సుగమం చేస్తాయని వివరించారు. భారత్ మొత్తం 433 విదేశీ ఉపగ్రహాలను విజయవంతంగా ప్రయోగించిందని, వాటిలో 396 ప్రయోగాలు గత దశాబ్ద కాలంలోనే జరిగాయని పేర్కొన్నారు. 2047 నాటికి దేశం 100 గిగావాట్ల అణుశక్తిని లక్ష్యంగా చేసుకుందని, అలాగే... కర్బన ఉద్గారాలను 50 శాతం తగ్గించాలనే లక్ష్యంతో ఉందని కేంద్ర మంత్రి తెలియజేస్తూ...

(వాయిస్ 30 సెకన్లు)

==========

గడచిన సంవత్సరంలో వరదలు, తుపానులు, కొండచరియలు విరిగిపడటం వంటి ప్రకృతి వైపరీత్యాలతో ప్రభావితమైన 5 రాష్ట్రాలకు జాతీయ విపత్తు ప్రతిస్పందన నిధి (NDRF) నుండి ఒక వెయ్యి 554 కోట్ల రూపాయల అదనపు సహాయాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రకటించింది. కేంద్ర హోం మంత్రి అమిత్ షా అధ్యక్షతన జరిగిన ఉన్నత స్థాయి కమిటీ సమావేశంలో ఈ మేరకు ఆమోదం లభించింది. ఇందులో భాగంగా ఆంధ్రప్రదేశ్‌కు 608 కోట్లు, తెలంగాణకు 231 కోట్లు, ఒడిశాకు 255 కోట్లు, నాగాలాండ్‌కు 170 కోట్లు, త్రిపురకు 288 కోట్ల రూపాయలకు పైగా నిధులు మంజూరు చేసినట్లు హోం మంత్రిత్వ శాఖ తెలియజేసింది.

==========

అవయవ దాతలకు రాష్ట్ర గౌరవ పురస్కారాన్ని అందజేయాలని పుదుచ్చేరి ప్రభుత్వం నిర్ణయించింది. ఇతరుల ప్రాణం రక్షించే అవయవ దాతలకు వారి దాతృత్వానికి గౌరవ సూచకంగా రాష్ట్ర గౌరవ పురస్కారాన్ని అందజేయనున్నట్లు పేర్కొంటూ... దీనిని అమలు చేసేలా మార్గదర్శకాలను రూపొందించింది. కొత్త మార్గదర్శకాల ప్రకారం, జిల్లా కలెక్టర్లు, ప్రాంతీయ నిర్వాహకులు అవయవ దాతల నివాసాలకు వెళ్ళి, నివాళులర్పిస్తారు. రిపబ్లిక్ డే, స్వాతంత్ర్య దినోత్సవం వంటి సందర్భాలలో అవయవ దాతల కుటుంబాలను అధికారిక కార్యక్రమాలకు ఆహ్వానించి సత్కరిస్తారు. బ్రెయిన్ డెడ్ కేసులను వెంటనే జిల్లా కలెక్టర్లు, ప్రాంతీయ నిర్వాహకులకు తెలియజేయాలని ప్రభుత్వం ఆసుపత్రులను ఆదేశించింది.

==========

మహాకుంభ్‌ను ఈ నెల 26 తర్వాత పొడిగించినట్లు వస్తున్న వదంతులను ఉత్తరప్రదేశ్ ప్రభుత్వం తోసిపుచ్చింది. ప్రయాగ్‌రాజ్ జిల్లా మేజిస్ట్రేట్ రవీంద్ర మంధాద్ ఈ మేరకు ఒక ప్రకటన చేస్తూ... సామాజిక మాధ్యమాల్లో వ్యాపిస్తున్న వదంతులు అవాస్తవమని స్పష్టం చేశారు. మహాకుంభం ఈ నెల 26న ముగుస్తుందని, పొడిగించాలన్న ప్రతిపాదన ఏదీ లేదని పేర్కొన్నారు.

==========

న్యూజిలాండ్ కు చెందిన ఉన్నత స్థాయి ప్రతినిధి బృందం ఈరోజు చండీగఢ్‌లో పంజాబ్ రాష్ట్ర పశుసంవర్ధక శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీతో సమావేశమయ్యింది. జంతు పెంపకం, చిన్న- హోల్డర్ డైరీ వ్యవస్థలు నెలకొల్పడం, పాల

దిగుబడిని పెంచేలా స్థిరమైన జన్యు పురోగతిని సాధించే అంశంపై ఈ సమావేశంలో ప్రధానంగా చర్చించారు. జూలై 2013లో ప్రారంభించబడిన జాతీయ డెయిరీ ప్లాన్-1 కింద పంజాబ్‌లో కొనసాగుతున్న కార్యక్రమాల గురించి ప్రిన్సిపల్ సెక్రటరీ... ప్రతినిధి బృందానికి వివరించారు.

==========

గుజరాత్ అసెంబ్లీ బడ్జెట్ సమావేశాలు ఈరోజు గాంధీనగర్‌లో గవర్నర్ ఆచార్య దేవవ్రత్ ప్రసంగంతో ప్రారంభమయ్యాయి. పేదలు, యువత, రైతులు, మహిళల అభ్యున్నతిపై దృష్టి సారిస్తూ.. రాష్ట్ర సర్వతోముఖాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని గవర్నర్ తన ప్రసంగంలో ఉద్ఘాటించారు. మౌలిక సదుపాయాలు, ఉపాధి కల్పన, గిరిజనాభివృద్ధి, వ్యవసాయం సహా వివిధ రంగాలలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన కార్యక్రమాలను గవర్నర్ ప్రస్తావించారు.

==========
==========